# ఏదీ నీది కాదు

పునర్వసు ఆరోగ్యం రోజురోజుకీ దిగ జారిపోతుంది కోమాలోకి వెళ్ళిపోయి ఆ రోజులయింది క్రమంగా కాళ్ళు చచ్చుపడిపోయాయి డాక్టర్ అవి పాదాల మీద సూదితో గుచ్చినా స్వల్ప మైన కదలికకూడా లేదు మోకాళ్ళపైన గుచ్చితే కదలిక వుంది మర్నాడు మోకాలి పైభాగం కూడా చచ్చుపడిపోయింది. నాభి ప్రాంతంలో గుచ్చితే సెన్సేషన్ వుంది. మర్నాడు గొంతు కింది భాగం అంతా చచ్చుపడిపోయింది.

"ఇంక కొన్ని గంటలే!" చెప్పాడు డాక్టర్ పునర్వసు కొడుకుకి రహస్యంగా

* * *

చాలామంది ఉద్యోగస్థులు ఇక రిటెయిరయిపోతామనగానే ఆలోచించే విషయాల్లో ముఖ్యమయినది. అప్పటిదాకా లేకపోతే స్వంతిల్లు గురించి మరో సంవత్సరంన్నర తర్వాత రిటయిరయిపోయే పునర్వసు మనసులోకూడా ఆ ఆలోచన చాలా నెలలుగా మసలుతోంది.

ఆఫీస్ క్వార్టర్స్‌లో వుంటూ వస్తున్నాడు సర్వీసులో వున్నంత కాలం రిటయిరయ్యాక క్వార్టర్స్ కాళీ చేయాల్సి వుంటుంది.

ఇల్లు కట్టుకునే ఆలోచనరాగానే తగిన ప్రయత్నాలు ప్రారంభించాడు గాజువాకదగ్గర ఎప్పుడో స్థలం కొని వుంచాడు. తన బడ్జెట్‌కి సరిపడే మేరలో ఇంటికి ప్లాన్ గీయించి మునిసిపల్ కార్పొరేషన్‌లో సబ్‌మిట్ చేసాడు ఆ రోజునించి మొదలైంది పునర్వసు అవస్థ.

ప్లాన్ సేంక్షన్ చేయించుకోవటం, ఇల్లు కట్టేందుకు తాపీ మేస్త్రీలని, కూలీలని మాట్లాడుకోవటం, ఇంటికి కావలసిన ఇటుకలు-ఇసుకలాంటి సామానుని సప్లై చేసేవారితో బేరం ఆడటం, ప్రావిడెంట్ ఫండ్ ఫైనల్ విత్‌డ్రాయల్‌కి అప్లై-చేయటం ఇంటికి శంఖుస్థాపన జరిగేనాటికి జి పి ఎఫ్ డబ్బులప్ప పైసా లేదు పునర్వసు దగ్గర. పునాదులు వేసాక నెలరోజులు

ఆగింది పని తెనాలిలో తనకి, చెల్లెలికి కలసివున్న చిన్న పెంకుటిల్లుని అమ్మేసాడు. గోడలులేచాయి తన మోటార్ సైకిల్‌ని అమ్మేశాడు. భార్య బంగారం అమ్మేశాడు.

రిటయిర్మెంటుకి నెలముందు ఇల్లు పూరయింది గృహప్రవేశం సామాన్యంగా చేసుకున్నాడు. ఇంటి బయట ప్లాస్టింగ్, ఇంటి కిటికీలకి రెక్కలు, లోపల సున్నం వేయటంలాంటి అనేక పనులు మిగిలిపోయాయి. అద్దె లేకుండా స్వంతఇల్లులోకి మారినందుకు పునర్వసు సంతోషించాడు. రిటయిరయ్యాక వచ్చిన గ్రాట్యుయిటీతో చేసిన అప్పులు తీర్చేసాడు, ఇంట్లో రెండు గదులు అద్దెకికూడా ఇచ్చాడు, కొత్తగా పెళ్ళయిన దంపతులకి.

పునర్వసు భార్య చెప్పింది ఆయనతో గృహప్రవేశం రాత్రి-

"మీరెంత కష్టపడ్డారండీ! ఈ సంవత్సరం నించి మీ ధ్యాసంతా ఇంటిమీదే! మన పెళ్ళయ్యాక మీరు ఇంత హైరానపడటం నేనెరుగను"

"అందుకనే అన్నారు పిచ్చి మొహమా ఇల్లు కట్టిచూడు అని ఇది నా ఇల్లు అనుకుంటే ఎంత హాయి" నవ్వాడాయన.

* * * *

పునర్వసు కొడుకు తల్లి చెవిలో గుసగుసలాడాడు. తమ్ముడిని సంప్రదించాడు తెలుగు కేలండర్ తిరగేశాడు. నక్షత్రం చూశాడు పురోహితుడి సలహా అడిగాడు.

భోరున వర్షం కురుస్తున్నా, తండ్రిని ఇంట్లోంచి రోడ్డుమీద వేసిన నులక మంచం మీదకి మార్చారు ఆయన తడవకుండా నాలుగుగుంజలుపాతి, టార్పాలిన్‌తో చిన్న టెంట్ తయారుచేశారు, జల్లు పడకుండా నాలుగు వైపులా గొడుగులు అడ్డు పెట్టారు.

మార్నాడు తెల్లవారు ఝామున స్పృహ వచ్చింది పునర్వసుకి. తనెక్కడున్నాడో గ్రహించగానే ఆయన ప్రాణాలు చిన్న నిట్టూర్పుతో పోయాయి